# ముందడుగో ముళ్ళకంపో

## సుగుణ




**'ఉత్తరాలేమైనా వచ్చాయా' అని అడిగింది వచ్చిన నాగేశ్ ని సుజాత**

ఏదో రావాల్సిన, ఎదురుచూస్తున్న జాబు కోసం ఆదుర్దా కాకపోయినా, రోజూ నాగేశ్ ఇంటికి రాగానే కాఫీకప్పుతో ఎదురెళ్లి అలా అడగటం అలవాటు, ఎక్కణ్ణుంచి అయినా వస్తే బాగుండు నన్న ఆశతో.

అయితే యీసారి రోజూలా కాకుండా ఇంట్లోకి రావటమే విసురుగా వచ్చాడు. మొదట బిత్తర పోయినా ఏదో పనినుంచి వచ్చిన బడలిక, కాసేపటికి తనే సర్దుకుంటాడనుకొని, అలవాటుగా ఆ ప్రశ్న అడిగింది. నాగేశ్ జేబులోంచి ఒక కవరు తీసి విసురుగా సుజాత ముఖాన కొట్టినంతగా టేబిలు మీద పడేసి,తెచ్చిన కాఫీని 'అక్కడపెట్టు' అని బాత్ రూమ్ లోకి వెళ్లాడు.

ఎప్పుడూలేని ఆ విసురు చూసి తెల్లబోయి, సుజాత నెమ్మదిగా తేరుకొని కవరు వంక చూసింది. "అరె! అమ్మ దగ్గర్నుంచే!" అనుకొంది కళ్లు మెరిసిపోతూండగా. అంతలోనే నాగేశ్ ప్రవర్తన గుర్తుకురాగా కళ్లు చిట్లించుకొని కవరు తెరిచి చదవసాగింది.

"చి॥ సౌ॥ సుజాతకి,

మీ అమ్మ ఆశీర్వదించి వ్రాసేది. నేను మీకు తెలియపరచవలసిన ముఖ్య విషయం —

రేపు అనగా ఈ నెల ఇరవయివ తేదీన నేనూ, శ్రీ శంకరంగారూ రిజిస్టర్డు వివాహం చేసుకోబోతున్నాము.

శ్రీ శంకరంగారు మీకు సుపరిచితులే. మంచివారని వేరే చెప్పక్కర్లేదు. భార్యపోయాక, నాలాగే పిల్లల్నందర్నీ ఒకదారిన పెట్టాక పైబడుతున్న వయస్సులో సాహచర్యం అవసరం అనిపించి, అదే పరిస్థితిలో వున్న నన్ను అడిగారు. ఆలోచించగా నాకు అందులో తప్పు కనిపించలేదు. ఒప్పేసుకొన్నాను. అదే మీకు తెలియపరుస్తున్నాను.

మీ అమ్మ, వసుంధర."

"ఏం? అంత బాగుందా! పదే పదే చదివేసకొంటున్నావు" అన్నాడు నాగేశ్ ప్రవేశిస్తూ.

ఒళ్లు మండింది సుజాతకి. అయినా తమాయించుకొని ఆ కవరు అక్కడే టేబిల్ పై వదిలి వంటింట్లోకి దారితీసింది. కాని ఏం వంట చేస్తున్నదో తనకే తెలియటంలేదు.

బియ్యం ఏరుతూ అదే ఆలోచన. కూరలు తరుగుతూ అదే ఆలోచన. "ఈ వయస్సులో అమ్మకు రెండో పెళ్లేమిటి? ఛీ! అనుకోవటానికే ఎంత యిదిగా వుంది.

అయినా యిప్పుడేం అవుసరమొచ్చింది? బాధ్యతలన్నీ తీరిపోయాయి. మొన్న తనకూడా మరి మరీ చెప్పారు — 'ఒక్కరూ ఏమ ుంటారు. మా దగ్గరుండండ'ని. అంతలోనే యీ నిర్ణయానికెప్పుడొచ్చింది ... అయినా ఆ శంకరంగారికి కూడా యిదేం బుద్ధి. ఇదేం అమెరికా, ఐరోపా అనుకొన్నారా? ప్చ!" అనుకొని మళ్లీ వంట ధ్యాసలో పడ్డది.

"అవును పెద్దవయసులో పిల్లల దగ్గరవుండి

వాళ్ళకి భారంగా వుండేకంటే ఒకళ్లకి ఒకళ్ళు తోడుగా ఉండటానికి నిశ్చయించుకొన్నారు. వాళ్ళేం ఎదిగిన పిల్లలు యింట్లో తిరుగుతూండగా బాధ్యతలు మరచి రెండో పెళ్లి చేసుకొని వూరేగ పోవటంలేదే ..."

"అయినా అప్పుడు తన దగ్గిర వుండమన్నాడు కాని ... తనకీ తల్లితండ్రులున్నారుగా. ఎప్పటి కయినా వాళ్ళు తన దగ్గరకు రావాల్సిన వాళ్ళేగా..."

ఇలా ఆలోచించగా ఆలోచించగా మొదటి షాక్ కరిగిపోయింది. ఒక విధమయిన అవగాహనకు రాసాగింది. అసలు అమ్మ చేస్తున్నది మంచి పనే అనిపించసాగింది, సుజాతకి. ఒక్కమాటుగా మనస్సు తేలికపడింది. చకచకా వంట చేసేసింది.

* * *

అత్తగారు చెయ్యబోతున్న పనికి నాగేశ్ మనసు కుతకుతలాడిపోతున్నది. హాంగామా చెయ్యటం యిష్టంలేక అయిష్టంగానే కంచంముందు కూచున్నాడు. తనకు తెలియకుండానే పెట్టినదంతా లాగేశాడు. భోజనాలు చాలా మౌనంగా సాగిపోయాయి.

వంటయిల్లు సర్దుకొని పడక గదిలోకి చేరింది. ఇంక వుండబట్టలేక, పేపర్ మడిచి అవతలపడేసి "ఏం మీ అమ్మగారి ద్వితీయ వివాహ సందర్భంగ వంట అమోఘంగా చేశావే" అన్నాడు వెటకారంగా. "బాగానే పట్టించారే. ఆ వెటకారాలెందుకు" అన్నది, చురచురా చూస్తూ.

"అయితే యేమిటంటావు. మీ అమ్మగారు కాబట్టి ఆ చేస్తున్న పని అద్భుతమని నువ్వనుకోవచ్చు. మిగతావాళ్లకి అదెంత ఏహ్యంగా వుంటుందో ఆలోచించావా ? ఆవిడ చేస్తున్న పనికి సిగ్గు పడాల్సిందిపోయి, వెనకేసుకొస్తున్నావా ?"

"నేను అన్నీ ఆలోచించాను. పైగా నేను ఎవర్నీ వెనకేసుకరావటంలేదు. మీరే జరిగినదాంట్లో మంచీ చెడూ ఆలోచించకుండా..."

"ఇందులోకూడా మంచీ చెడూ ఆలోచించ టానికేముంది."

"అదిగో అదే వద్దంటున్నాను. కాస్త వెటకారం ఆపితే, నేనొక ప్రశ్న సూటిగా అడుగుతాను." నాగేశ్ మౌనంగా వుండిపోయాడు. "ఇంతకీ మా అమ్మ చేసిందాంట్లో తప్పేమిటి ?"

"ఎబ్బే మీ అమ్మగారు చేసిందికాబట్టి తప్పేమీ లేదు. ఘనకార్యం అంటావు. అంతేనా ?"

"అదిగో మాటిమాటికీ మీ అమ్మగారు మీ అమ్మగారని గుర్తు చెయ్యక్కరలా... యింతకీ అసలు జవాబు రాలేదు. మరోసారి కావాలంటే చదవండి."

తిరిగి మౌనంగా వుండిపొయ్యాడు. "ఆవిడేం ఎదిగిన పిల్లలు ఇంట్లో వుండగా తను మహా పెళ్లి చేసుకొని ఊరేగలేదే. ఎవరి దారిన వాళ్ళం వెళ్లిన మీదటే, ఒంటరితనం భరించలేక, ఆ వేళకి శంకరంగారే అడగబట్టి అభ్యంతరం చెప్పలేదు. కొడుకు పంచన వుండటంకన్న స్వతంత్రంగా తనకొక తోడు అసర వయస్సులో వుంటుందని వొప్పుకుంది. మన సంఘం యిలాంటి వివాహాలకు అలవాటు పడలేదు. ఇదే మొదటిది కాబట్టి విరుద్ధం, విడ్డూరం అనిపిస్తుంది. అంతేకాని అందులో అంత చెయ్యకూడని తప్పు నాకేం కనిపించటంలేదు."

"అవును. నీ కెందుకు కనిపిస్తుంది. ఇంట్లో వుండే దానివి కాబట్టి నీకు ఫరవాలేదు. తెల్లవారితే పదిమంది మధ్య మెలగాల్సినవాణ్ణి. రేపీ విషయం అందరికీ తెలిశాక, ఆ వెధవలందరికీ, నేను చెయ్యని తప్పుకి, నేను తలవంచుకోవాల్సినప్పుడు ... నా పరిస్థితి కాస్త ఆలోచించు."

"ఏం మీరు నలుగురి ముందూ తలవంచు కోవాల్సినంత సిగ్గుమాలిన పని ఆవిడేం చెయ్యలేదే. రెండోదే కావచ్చు శుభ్రంగా, సభ్యంగానే చేసుకుంటున్నది. ఎవరితోనూ లేచిపోలేదే. ఎదిగిన పిల్లల్ని ఇంట్లోవుంచి తాను పెళ్లిచేసుకొని కులకటం లేదే. మరెందుకా పదిమంది బాధ.

పోనీ ఒకవేళ మా అమ్మ చేసింది తప్పే అనుకొందాం. అయితే మాత్రం ? వీళ్ళకేమిటి సంబంధం. అదే వీరు గట్టిగా అడగలేరా ?"

"ఆఁ నీకేం యింట్లో కూచొని ఎన్నైనా కబుర్లు చెబుతావు."

"అవునవును మీకే అన్ని బాధలూనూ. నేను యింట్లో కూర్చొంటే మాత్రం, మన చుట్టూవున్న అమ్మలక్కలు వూరుకొంటారా ? మీరు బయటనయితే నేను యింట్లో వుండే అన్నిట్నే ఎదుర్కోవాలి.

ఊహుఁ యింతకీ అమ్మచేసిన దాంట్లో తప్పేమిటో చెప్పారు కాదు."

నిజానికి ఆ ప్రశ్నకు జవాబు నాగేశ్‌కి తోచటం లేదు. అలాగని అత్తగారు చెయ్యబోతున్న పని సమంజసమైనదనీ అనిపించటంలేదు. అందుకని మాట్లాడకుండా రెండో పక్కకి తిరిగిపొయ్యాడు నాగేశ్.

త్వరలో

# నర్సింగ్ హోం

సీరియల్

"ఇదిగో. మిమ్మల్నే. 'రెండు మూడురోజుల్లో బయల్దేరి అమ్మ దగ్గరికెళ్దామనుకొంటున్నాను మీరూ వస్తే బాగుంటుంది" అంది సుజాత.

దానికి కూడా జవాబు ఏం రాలేదు.

"ఇదెలాగూ యింత తేలిగ్గా పరిష్కారమయ్యే సమస్యకాదు" అనుకొని తాను కూడా లైటార్పి నిద్రకుపక్రమించింది.

* * *

కొడుకు దగ్గర్నుంచీ వచ్చినవుత్తరం ఆత్రుతగా చదువుకున్న వసుంధర, తేలిగ్గా గాలి పీల్చి తలెత్తి చూసేసరికి, రిక్షాలోంచి దిగుతున్న కూతురూ, అల్లుడూ అవుపించారు.

ఉత్తరంలో అయితే ఏదో తెగించి రాసిందే కాని తీరా వాళ్లే ఎదుటపడేసరికి గుండె బితుకు మంటంతో ఏం మాట్లాడలేకపోయింది. అంతలో "అమ్మా ! కంగ్రాచులేషన్స్" అంటూ, ఇద్దరూ లోపలికి వచ్చేశారు. అంతలో తేరుకొని చిరునవ్వు తెచ్చిపెట్టుకొని, కుశల ప్రశ్నల్ని వేస్తూ లోపలకు వాళ్లతో ప్రవేశించింది. చేతిలో వున్న వుత్తరంవేపు సుజాత ప్రశ్నార్థకంగా చూసింది. వసుంధర సారాంశం చెప్పింది.

అంతలో తేలికపడ్డ గుండెలతో వసుంధర లోపలకు వెళ్లింది. నాగేశ్ యిల్లంతా కలయ చూస్తూ పక్కనే కుర్చీలో కూలపడ్డాడు. వరస ప్రకారం కాఫీ, టిఫిను, స్నానాలు అవుతూండగా శంకరంగారు ప్రవేశించారు బజారు పని ముగించు కొని. వీళ్లని చూస్తూనే గతుక్కుమన్నాడు. మళ్లీ తమాయించుకొని యిద్దరినీ, కొత్త హోదాలో మామగారుగా ఆప్యాయంగా పలకరించాడు. వసుంధర తన కొడుకు రాసిన వుత్తరం అందించింది. దాన్ని చదువుకొని పెద్ద నిట్టూర్పు విడిచి 'హమ్మయ్య' అనుకొన్నారు శంకరంగారు.

## స్పేస్ షటిల్ తుది పరీక్షలు

అమెరికన్ స్పేస్ షటిల్ ప్రయోగం కోసం ఈలోగా అనేక కీలకమైన పరీక్షలు ముందుగా జరుగుతాయి.

ఫ్లారిడాలో కెనెడీ వ్యోమ కేంద్రంలో స్పేస్ షటిల్ వాహనం ప్రయోగానికి సిద్ధంగా ఉంచారు. డిసెంబరు 29న ఈ వాహనాన్ని ప్రయోగ వేదికమీద అమర్చిన నాటినుంచి రకరకాల పరీక్షలు జరుపుతున్నారు.

మార్చి 13 మొదలు 15 వరకు, ఈ వాహనంలోనే ఎలెక్ట్రికల్ కనెక్షన్లు, స్విచ్‌లు, తదితర పరికరాలను ఇంజనీర్లు, శాస్త్రజ్ఞులు క్షుణ్ణంగా పరీక్షించారు.

ఇక ఆఖరి దశ కౌంట్ డౌన్. ఇది మార్చి 19 నుంచి ప్రారంభమవుతుంది. ఈ అంతరిక్ష విమానంలో ప్రయాణం చేసే వ్యోమగాములు యాత్రకు సిద్ధంగా ఉన్నారు. యాత్రను కంట్రోలు చేసే సాంకేతికులు ఎవరికి నిర్దేశించిన స్థానాలలో వారు ఆశీనులైనారు. భూతల కేంద్రాలలో పనిచేసే ఇంజనీర్లు తమ పనులు తాము చూసుకొంటున్నారు. ఈ కౌంట్ డౌన్ 73 గంటలసేపు జరుగుతుంది. ప్రయోగ వేదికపైనున్న స్పేస్ షటిల్ కాక్‌పిట్‌లో వ్యోమగాములు ఆశీనులై ఉన్నారు.

# ముందడుగో - ముళ్లకంపో

అక్కడికి వచ్చేదాకా నాగేశ్‌కి శంకరంగారూ వసుంధరల పట్ల ఆక్షేపణ లేకపోలేదు. కాని వచ్చిం దగ్గర్నుంచీ శంకరంగారు తనపై చూపుతున్న వాత్సల్యంతో వున్న వైముఖ్యత కాస్తా కరిగి పోయింది. కొత్త అనుభూతులకు లోనవుతున్నాడు. తనకు మామగారు లేరన్న లోపం ఎక్కడా కనపడటం లేదు. దాంతో ఆ నాల్గురోజుల్లో వారిద్దరికి సాన్నిహిత్యం పెరిగిపోయింది.

* * *

పోస్ట్ అన్న కేకవిని ఉలిక్కిపడి లేచారు శంకరంగారు. తన పేరనే వుందా వుత్తరం. దస్తూరి తన కొడుకుదే. తెరవటానికి క్షణం తటపటాయించాడు. పక్కనే టేబిలుమీదపెట్టాడు. మళ్లీ వుండపట్టలేక అందుకొని తెరిచారు. కొట్లాడుతున్న గుండెతో చదవటం మొదలెట్టారు.

పోస్టుమనిషి కేకవిని ముందు గదిలోకి వచ్చిన వసుంధర, శంకరంగారి చేతిలో వుత్తరం చూసి, చదువుతున్న శంకరంగారి ముఖాన్ని చదవటానికి ప్రయత్నిస్తున్నది.

చదవటం ముగిశాక, బాధగా కణతలు నొక్కు కొంటూ వసుంధర చేతికి వుత్తరం యిచ్చారు. వసుంధర చదువుకోసాగింది —

"... మీరు వేసిన ముందడుగుకి చాలా సంతోషం. ధన్యవాదాలు. మీ ఉభయులకు నా హృదయపూర్వకాభినందనలు.

అపరవయస్సులో కంపెనీ అవసరమనే మీరు చేసుకొన్నారనే అనుకొంటా. అంతకన్నా స్త్రీ పునర్వివాహము సమంజసమని చాటటానికీ, దానిని ప్రోత్సహించటానికీ కూడా చేశారనే అనుకొంటా ... కానీ... ఒకటే... ఆస్తిని కూడా పంపిణీ చేసేసి ఈ పని కానిస్తే బాగుండేది. అయినా మించిపోయిం దేమీలేదు. ఇప్పుడైనా చెయ్యొచ్చు. ఎప్పుడైనా చెయ్యొచ్చుగదా అని తాత్సారం చెయ్యకండి..." యిదీ సారాంశం.

"అంత బాధపడతారెందుకూ. అతను రాసిన మాటా నిజమే. ఆ పనికూడా చేసేసివుండాల్సింది. అన్నట్లు నేనూ చెయ్యలేదు.

అలా బెంబేలు పడడం ఆపి ఆ పనికూడా చెయ్యండి" అంటూ లోపలికెళ్లింది.

"వీడి తాత సొత్తల్లే మాట్లాడుతున్నాడు. అది నా స్వార్జితం" అని గొణుక్కొన్నారు, ఒంటరిగానే.

* * *

రిజిష్టర్డ్ వివాహం అయిన రాత్రి శంకరం గారింటిమీద రాళ్ళు కురిసాయి. ఒకటి రెండు కిటికీలోంచి లోపలికొచ్చి పడ్డాయికూడా. తర్వాత తగ్గిపోయ్యాయి. అందువల్లనే వసుంధర యింకా శంకరంగారితో వీధిలోకెళ్లటానికి జంకుతోంది.

వీటన్నిటినీ నెమరు వేసుకొంటూ భోజనాలయిం తర్వాత మధ్యాహ్నం వరండాలో పచార్లు చేస్తున్నారు శంకరంగారు. గేటు చప్పుడయింది. చూసేసరికి ఎదురుకుండా కూతురు కల్యాణి సూట్‌కేసుతో నిల్చొనివుంది. సూట్‌కేసు నందుకొని లోపలికి తీసుకొస్తూ "రామ్మా రా! అతను రాలేదా?" అని అడిగారు. అప్పటికే వసుంధరా, నాగేశ్, సుజాతా ప్రవేశించారు. కల్యాణి "పిన్నీ! కంగ్రాచులేషన్స్" అంటుంటే వసుంధర కల్యాణిని అక్కున చేర్చుకొంది. లోపలకు తీసుకొచ్చింది. తిరిగి శంకరంగారు "అతను రాలేదా" అన్నారు. దాంతో కల్యాణి చ్రుమని లేచి "వాళ్ల సంగతి నన్నడగకండి. వాళ్లకీ నాకూ మరింక సంబంధం లేదు" అన్నది.

"అయ్యొయ్యొ! అవేం మాటలమ్మా" అంటూ వసుంధర లబలబలాడింది.

"మీరేం యిదవకండి. వాళ్లదేమో అర్షేయ పౌర్షేయ వంశముట. వాళ్లయింటావంటా లేవట యిలాటి అపభ్రంశాలు. అలా మామగారూ, అత్తగారూ అదే పనిగా సాధించసాగారు. ఇక ఆయన వుండనేవున్నారు, అదే పనిగా మిమ్మల్ని చులకన చేస్తూ ..."

సుజాత నాగేశ్ వంక చూసి నవ్వుకొంది.

"పైగా మామగారు మరీ యిదిగా తయారయ్యారు. వాళ్ల వంశ ప్రతిష్ఠ మంట కల్సిందుట. పుట్టింట దిగవిడిచొస్తాను పెట్టె బేడా సర్దుకోమన్నారు. మీరేం దిగపెట్టక్కర్లేదు. నేనే వెళ్లిపోతున్నాను అని చక్కావచ్చేశాను. అంతే! మరింక వాళ్లవూసెత్తకండి" అని ఇంట్లోకి సరసరా వెళ్లిపోయింది.

అందరికి పిడుగు పడ్డట్టయింది. ★

## జ్ఞాపకాల చెక్కు

చెల్లా చెదరయిన స్మృతుల
చెక్కు చేసుకొని
జీవితంలో బ్రతుకు క్షణాల
రాలిన కణాల
బేరీజు వేసుకుందామని
బ్రతుకుతెరువు బ్యాంకుకు
డ్రా చేద్దామని వెళ్లాను!
ఆత్మ క్లార్కు అన్నాడు
అనుభవ లెడ్జర్ కార్డులో
సానుభూతి బ్యాలెన్సు సన్నగిల్లిందని
లో చూపుతో కారణాలు వెతికాను
ఆత్మవంచన అని తెలుసుకున్నాను

— యస్. యస్. రెడ్డి


## జాతీయ భాషా సమైక్యతా గ్రంథములు

తెలుగు భాష మాత్రము చదవగలిగినవారు యితర రాష్ట్రములకు పోయి అ దేశములో స్థిరపడిన తరువాత వ్యాపారము గాని, విద్యా సంస్థలయందు గాని, ఉద్యోగ సంస్థలయందు గాని ఆ దేశ ప్రజలతో వ్యవహరించుటకు కష్టపడేవారికి, దినచర్యకు ఉపయోగించే వార్తలు చేర్చి, సులభంగా వ్యాకరణ లోపం లేకుండా వ్రాయడానికి, చదవడానికి మరియు ఆ దేశ ప్రజలతో తేలికగా వ్యవహరించుటకు, ఈ క్రింద వివరించబడిన ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| 30 రోజులలో హిందీ భాష | 4-50 | 30 రోజులలో మరాఠీ భాష | 4-50 |
| 30 రోజులలో కన్నడ భాష | 4-50 | 30 రోజులలో గుజరాతీ భాష | 5-50 |
| 30 రోజులలో మలయాళ భాష | 4-50 | 30 రోజులలో ఒరియా భాష | 5-50 |
| 30 రోజులలో సంస్కృత భాష | 5-50 | 30 రోజులలో ఉర్దూ భాష | 5-50 |
| 30 రోజులలో ఆంగ్ల భాష | 7-50 | 30 రోజులలో తమిళ భాష | 4-50 |
| 30 రోజులలో బెంగాలీ భాష | 4-50 | 30 రోజులలో పంజాబి భాష | 5-50 |

ఆంగ్ల సంభాషణం - తెలుగు వెల రూ. 7-50

మీరు పుస్తకాలకు ఆర్డర్ వేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103, Pycrofts Road, Madras-600 014